జడ్జిమెంట్ డే

నేడే ఓట్ల లెక్కింపు.. ఉత్కంఠకు తెర

- రాష్ట్రంలో 34 కౌంటింగ్ కేంద్రాలు
- మొత్తం 2,131 టేబుళ్లపై కౌంటింగ్
- ఓట్ల లెక్కింపునకు 10 వేల సిబ్బంది
- 49 కేంద్ర ఎన్నికల పరిశీలకులు
- తొలుత నిజామాబాద్, వరంగల్ ఫలితాలు
- సాయంత్రం 4 గంటల్లోగా మిగిలిన ఫలితాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న 'గ్రేటర్' ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు మరికొన్ని గంటల్లో వెలువడనున్నది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. తొలుత నిజామాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల ఫలితాలు వెల్లడికానున్నాయి. మిగిలిన ఫలితాలు సాయంత్రం 4 గంటల్లోగా వెల్లడయ్యే అవకాశం ఉన్నది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను 34 కౌంటింగ్ కేంద్రాల్లో 2,131 టేబుళ్లపై లెక్కించనున్నారు. వాటిలో ఈవీఎం ఓట్లను లెక్కించేందుకు 1,855 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు 276 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించడానికి వేర్వేరు కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు 10 వేల సిబ్బందిని నియమించారు. సర్వీసు ఓట్లను స్కాన్ చేసేందుకు 135 స్కానర్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఇద్దరు సూపర్‌వైజర్ల సమక్షంలో ఓట్లను లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 12 కంపెనీల కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడంతోపాటు అడుగడుగునా సీసీ కెమెరాలను నెలకొల్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలాంటి ఫోన్లు, కెమెరాలను అనుమతించరు. ఓట్ల లెక్కింపు తర్వాత కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఓట్ల లెక్కింపును పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 49 మంది పరిశీలకులను నియమించింది. ఎన్నికల ఫలితాలను ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్రంలోని 78 ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేసింది.

ఏ నియోజకవర్గానికి ఎన్ని రౌండ్లంటే..

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 15 రౌండ్లలో పూర్తికానుండగా.. వరంగల్ సెగ్మెంట్ ఓట్లను 18 రౌండ్లపాటు, సికింద్రాబాద్ నియోజకవర్గ ఓట్లను 20 రౌండ్లపాటు లెక్కించనున్నారు. మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 21 రౌండ్లలో పూర్తి కానున్నది. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే మూడు విడతలుగా శిక్షణ ఇచ్చారు. అదనంగా 20 శాతం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 5 పోలింగ్ కేంద్రాల వీవీప్యాట్లలోని స్లిప్పులను ర్యాండమ్‌గా లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపునకు 700 కంప్యూటర్లు, 800 ఐటీ సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

- నిజామాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి తొలి ఫలితాలు.
- ఆర్మూర్, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్ల లెక్కింపు 13 రౌండ్లలోనే పూర్తవుతుంది.
- ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపునకు 1,855 టేబుళ్లు ఏర్పాటు చేశారు.
- పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 276 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు

లోక్‌సభ నియోజకవర్గం	2024 లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లు	2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లు	టేబుళ్లు	ఓట్ల లెక్కింపు రౌండ్లు
ఆదిలాబాద్	12,21,563	13,07,588	114	23
పెద్దపల్లి	10,83,453	12,25,768	124	21
కరీంనగర్	13,03,690	13,76,685	116	24
నిజామాబాద్	12,26,133	12,47,893	140	15
జహీరాబాద్	12,25,049	13,18,182	112	23
మెదక్	13,72,894	14,37,897	121	23
మల్కాజిగిరి	19,19,714	16,12,559	178	21
సికింద్రాబాద్	10,39,834	10,59,687	119	20
హైదరాబాద్	10,74,827	9,92,152	108	24
చేవెళ్ల	16,57,107	17,40,099	165	23
మహబూబ్‌నగర్	12,18,587	13,19,086	112	21
నాగర్‌కర్నూల్	12,07,469	14,00,049	120	22
నల్లగొండ	12,77,137	14,44,696	122	24
భువనగిరి	13,88,680	15,38,710	127	23
వరంగల్	12,56,301	14,07,768	125	18
మహబూబాబాద్	11,01,030	12,52,271	112	22
ఖమ్మం	12,41,135	13,58,339	116	21

వస్త్రపరిశ్రమలో సర్కారు కిరికిరి!

- యాజమానులు, ఆసాములకు పంచాయితీ
- గతంలో యజమానుల ఖాతాకు నగదు
- ఇప్పుడు ఆసాముల అకౌంట్లలో జమ
- తలపట్టుకుంటున్న యజమానులు
- కేటీఆర్‌పై అక్కసుతోనే ప్రభుత్వం లొల్లిరాజేసినట్టు విమర్శలు

సిరిసిల్ల రూరల్, జూన్ 3 : 'ఓ ఆసామి, యాజమానికి మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు ఆసామి ఖాతాలో బకాయిలను జమ చేసింది. దీంతో వారిద్దరి మధ్య కొత్త పంచాయితీ మొదలైంది. లెక్కలు చేసుకుందాం.. ముందు పడిన డబ్బు పట్టుకురా అని యజమాని ఆదేశిస్తే.. ముందు లెక్కలు చేసి చెప్తేనే డబ్బు పట్టుకచ్చిస్తా.. లేకుంటే ఇచ్చేది లేదని సదరు ఆసామి తెగేసి చెప్పాడు.. ఇలా ఇద్దరి మధ్య కాంగ్రెస్ సర్కారు కొత్త కిరికిరి పెట్టింది.'

ఇప్పటిదాకా సాఫీగా సాగిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కాంగ్రెస్ సర్కారు చిచ్చురాజేసింది. నిన్న మొన్నటిదాకా ఇటు యజమానులు, అటు ఆసాములకు ఇబ్బంది లేకుండా ఉన్న విధానాన్ని మార్చి ఇరువర్గాల మధ్య కొత్త పంచాయితీ తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడం, కొత్త ఆర్డర్లు లేకపోవడంతో కార్ఖానాలు మూతపడ్డాయి. ఆరు నెలలుగా వస్త్ర పరిశ్రమలోని నేతకార్మికులు, అనుబంధకార్మికులకు పనిలేకుండా పోయింది. ఈ దుస్థితిలో ఆరుగురు నేత కార్మికులు బలవన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్, కార్మిక సంఘాల ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి ఒకసారి రూ.50 కోట్లు, ఎంపీ ఎన్నికల ముందు మరో రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేసింది. పలు ప్రభుత్వ యూనిఫాం ఆర్డర్లు ఇచ్చింది. ఇప్పటి దాకా బాగానే ఉన్నా ఆసాముల ఖాతాల్లో బకాయిలు జమ చేయడంతో యజమానులకు, ఆసాములకు మధ్య వివాదం మొదలైంది.

*గతంలో యజమానుల ఖాతాల్లో జమ

సిరిసిల్లలో సుమారు 30 మంది యాజమానులు, 1700 మందికిపైగా ఆసాములున్నారు. గతంలో యజమానులకు నేరుగా నగదు చేరేది. దీంతో ఎలాంటి సమస్యా లేకుండా యజమానులు, అసాముల సమన్వయంతో వస్త్రపరిశ్రమ నడిచింది. ప్రస్తుత ప్రభుత్వం ఆసాముల ఖాతాల్లో జమచేయడంతో ఇరువర్గాల మధ్య పంచాయితీలు మొదలయ్యాయి. పలువురు అసాములు తమ ఖాతాలో జమైన డబ్బును యజమానులకు ఇవ్వకపోగా కొన్ని మెలికలు పెడుతున్నారు. దీంతో కొత్త సమస్యలు వచ్చి యజమానులు తలలు పట్టుకుంటున్నారు. కొన్ని పంచాయితీలు ఠాణా దాకా వెళ్లినట్లు సమాచారం. మొన్నటిదాకా యజమానులు చెప్పినట్టు ఆసాములు నడుచుకునే వారు. ఇప్పుడు ఆసాములు ససేమిరా అనడంతో ఏం చేయాలో తోచక యాజమానులు పూర్తి బకాయిలు విడుదలయ్యేదాకా ఓపిక పడుదామని వేచి చూస్తున్నారు.

అరకొర బకాయిలు విడుదల చేసి.. కొత్త లొల్లి రాజేసి..

పూర్తి బకాయిలు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర విడుదల చేసి చాట్లో తవుడు పోసి కొట్లాట పెట్టినట్టు చేసిందని అటు యజమానులు, ఇటు ఆసాములు వాపోతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అండగా ఉందనే అక్కసుతోనే యజమానులకు, ఆసాములకు, కార్మికులకు మధ్య కిరికిరి పెట్టేలా కాంగ్రెస్ సర్కారు వ్యవహరించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

షా, కిషన్‌రెడ్డి పేర్లెలా తొలగిస్తరు?

- కోడ్ ఉల్లంఘన కేసులో పోలీసుల అత్యుత్సాహం
- ఈసీ చర్యలు తీసుకోవాలి: నిరంజన్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో బీజేపీ నేతలు అమిత్‌షా, జీ కిషన్‌రెడ్డి పేర్లను ఎఫ్ఐఆర్ నుంచి తొలగించిన పోలీసులపై చర్య తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ ఫిర్యాదు చేశారు. వీరి ప్రమేయం నిర్ధారణ కానందునే పేర్లు తొలగించినట్టు పోలీసులు పేర్కొనడంపై సోమవారం ఆయన ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తంచేశారు. సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ వారి ప్రమేయం లేదని పోలీసులు చెప్పడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లో మే 1న అమిత్‌షా ప్రచారసభ వేదికపై ఒక చిన్నారి బీజేపీ జెండా పట్టుకుని నినాదాలు చేసిందని, పిల్లలను ఎన్నికల కార్యక్రమాల్లో వినియోగించడం ఈ సీ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. దీనిపై ఈసీకి అదేరోజు ఫిర్యాదు చేయగా, ఆ మరుసటి రోజు మొగల్‌పురా పోలీస్ స్టేషన్‌లో టీ యమన్‌సింగ్, కొంపెల్ల మాధవీలత, అమిత్‌షా, కిషన్‌రెడ్డి, రాజాసింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. తమ ఫిర్యాదుపై స్పందిస్తూ మొగల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, జూన్ 1న పంపిన లేఖలో యమన్‌సింగ్, మాధవీలత, రాజా సింగ్ పేర్లనే ఎఫ్ఐఆర్‌లో చేర్చామని, అమిత్‌షా, కిషన్‌రెడ్డి ప్రమే యం నిర్ధారితం కానందున వారి పేర్లను తొలగించినట్టు తెలిపారన్నారు. కోడ్ ఉల్లంఘన కేసు నుంచి తప్పించడమంటే ఈసీని తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు.

లోకం పోకడ

రాజకీయ పార్టీలకంటే వీళ్లకే టెన్షన్ ఎక్కువయ్యింది!

ఒక్క క్లిక్‌తో లైవ్ 'రిజల్ట్'

వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన 'సీఎంఆర్' విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): దేశ భవిష్యత్తును నిర్ణయించే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను వేగంగా, భిన్నంగా ప్రజలకు అందించేందుకు సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు వినూత్న వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. results 2024.in అనే పేరుతో ఆవిష్కరించిన ఈ వెబ్‌సైట్‌లో దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలను అంకెలు, గ్రాఫిక్స్ రూపంలో అందించనున్నారు. ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే హోం పేజీలో భారత దేశ చిత్రపటం కనిపిస్తుంది. దాని కింద ఎన్డీఏ, ఇండియా కూటమి, ఇతరులు ఎన్ని స్థానాల్లో గెలిచారో, ఎన్ని స్థానాల్లో ఓడిపోయారో పార్టీల వారీగా వివరాలు ఉంటాయి. దీంతోపాటు రాష్ట్రాల వారీ జాబితా ఉంటుంది. భారత దేశ చిత్రపటంలో కావాల్సిన రాష్ట్రంపై క్లిక్ చేయగానే లైవ్ ఫలితాలు కనిపించడం మరో విశేషం. ఎన్నికల సంఘం అందించే అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు గ్రహించి మొత్తం జాతీయ స్థాయిలో, రాష్ట్రాల వారీగా పరిస్థితిని అంకెలతోపాటు గ్రాఫిక్స్ రూపంలో అందించనున్నారు . 2019 ఎన్నికల సమాచారాన్ని కూడా ఇందులో క్రోడీకరించారు. దీంతో రెండు ఎన్నికల ఫలితాలను అంచనా వేసేందుకు అవకాశం కలుగుతుందని విద్యార్థులు పేర్కొన్నారు.

ఏపీలో ఎమ్మెల్సీపై వేటు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఎమ్మెల్సీ రఘురాజుపై ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు అనర్హత వేటు వేశారు. రఘురాజు అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామాచేసి టీడీపీలో చేరారు. దీంతో రఘురాజుపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని వైసీపీ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్ రఘురాజును వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసులు ఇచ్చిన చైర్మన్ వద్దకు వెళ్లకపోవడంతో అనర్హత వేటువేసింది.

పార్లమెంట్ ఎన్నికల్లో 200 కోట్లు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో మార్చి 16 నుంచి జూన్ 3 వరకు పోలీసులు, తనిఖీ బృందాలు నిర్వహించిన సోదాల్లో రూ.200.27 కోట్లు దొరికినట్లు రాష్ట్ర పోలీసు విభాగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పట్టుబడిన నగదు రూ.46.3 కోట్లు కాగా 2024 పార్లమెంట్ ఎన్నికల తనిఖీల్లో తెలంగాణ పోలీసులు స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 149.54 కోట్లు. ఇందులో రూ.99.16 కోట్ల నగదును అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. రూ.11.48 కోట్ల విలువైన మద్యం, రూ.14.52 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.63.19 కోట్ల విలువైన ఆభరణాలు, నగలు రూ.11.91 కోట్ల విలువైన ఇతర ఉచితాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,272 లైసెన్స్డ్ గన్స్ డిపాజిట్ చేయగా అక్రమంగా వాడుతున్న 20 గన్స్‌ను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. వీటితోపాటు 2,756 జిలెటిన్ స్టిక్స్, 401 డిటోనేటర్స్, 847 సాధారణ డిటోటేర్స్ వంటి పలు పేలుడు పదార్థాలు తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 466 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 89 ఇంటర్‌స్టేట్ చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు నిర్వహించారు.

వర్షాలొస్తున్నాయ్... అప్రమత్తంగా ఉండండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వారం రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతులకు అవసరమైన పత్తి, జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సోమవారం విత్తనాలు, వానకాలం సీజన్ ప్రారంభంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట, పత్తి విత్తనాలను జిల్లాలకు సరఫరా చేశామని, వాటిని రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 84.53 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేయగా రైతులు 25.10 లక్షల ప్యాకెట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. 97,109 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచగా రైతులు 84,412 క్వింటాళ్లను కొనుగోలు చేశారన్నారు. అనుమతి లేకుండా ప్రత్తి విత్తనాల ప్యాకెట్లు విక్రయిస్తున్న 33 మందిపై కేసులు పెట్టి రూ. 2 కోట్ల విలువగల 118.29 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో ఫలితాల టెన్షన్!

- సీట్లు తక్కువొస్తే పరిస్థితేమిటి
- ఎవరి పదవులు ఊడుతాయో.. ఎవరికి అడ్డంకిగా మారుతాయో
- సీఎం సొంత జిల్లాలో ఓడితే.. ఆయన ఇచ్చే సమాధానమేమిటి?
- కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల ఫలితాల టెన్షన్ పట్టుకున్నది. ఫలితాలు ఏ విధంగా ఉంటాయోనని, ఆ ప్రభావం పార్టీపై, ప్రభుత్వంపై ఎటువంటి ప్రభావం చూపుతాయోనని కీలక నేతలంతా ఆందోళనతో ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలో అధికారంలో ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ సీట్లు సాధిస్తే అది పార్టీపై, ప్రభుత్వ పాలనా తీరుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు సంకేతంగా మారుతుందన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతున్నట్టు సమాచారం.

సీట్లు తక్కువొస్తే.. పరిస్థితేంటి?

లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ 10 నుంచి 12 సీట్లు గెలుస్తుందని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అయితే ఏకంగా 13 సీట్లు గెలవబోతున్నామని జోస్యం చెప్పారు. పైకి బీరాలు పలుకుతున్నప్పటికీ లోలోన మాత్రం అసలు ఫలితాలపై ఒకింత ఆందోళనగానే ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. తమకు 8 సీట్లు వచ్చినా పర్వాలేదని, అంతకన్నా తగ్గితే మాత్రం పార్టీకి, ప్రభుత్వాధినేతకు ఇబ్బందికర పరిస్థితేననే ఆ పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. కొన్ని సర్వేల్లో కాంగ్రెస్ పార్టీకి 6 సీట్ల వరకే వస్తాయని, మరికొన్ని సర్వేలు అంతకన్నా తక్కువే వస్తాయని ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. ఒకవేళ ఈ సర్వేల ఫలితాలే నిజమై.. తక్కువ సీట్లు వస్తే పార్టీ, ప్రభుత్వ పరిస్థితి ఏంటనే ప్రశ్నలు కాంగ్రెస్ నేతల్ని తొలచివేస్తున్నాయి. తక్కువ సీట్లు వస్తే పార్టీ నేతల్లో, ప్రజల్లో కూడా పార్టీపై నమ్మకం సడలిపోతుందని గాంధీభవన్‌లో చర్చ జరుగుతున్నది. ఇదే జరిగితే భవిష్యత్తులో పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవనే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతున్నది.

పదవుల గండం..

లోక్‌సభ ఫలితాలు కాంగ్రెస్ నేతలకు పదవీ గండాన్ని తెచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ ఫలితాలు ఎవరి పదవులను ఊడగొడతయో, ఎవరికి పదవులు రాకుండా అడ్డుపడతాయోననే ఆందోళన ఆశావాహుల్లో వ్యక్తమవుతున్నది. ఈ ఎన్నికల్లో పనితీరు, ఫలితాల ఆధారంగా మంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు తేల్చి చెప్పింది. దీంతో తమ పదవులకు ఢోకా లేదని పలువురు నేతలు అప్పట్లో గంతులేశారు. కానీ ఓటింగ్ నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోవడంతో ఇప్పుడు వారిలో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ ఎన్నికలు తమ గండానికే వచ్చాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి:సీఎం

పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాల్లో కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ అభ్యర్థులకు పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎంపీ అభ్యర్థులు, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మంత్రులు, ఏఐసీసీ సెక్రెటరీలతో సోమవారం ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నవారినే కౌంటింగ్ ఏజెంట్లుగా పంపాలని సూచించారు. సీనియర్ నాయకులను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి రౌండ్ కౌంటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఒక్కరి దగ్గర 17సీ జాబితా ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

సీఎం సొంత జిల్లాలో ఓడితే!

మహబూబ్‌నగర్ ఫలితంపై కాంగ్రెస్ పార్టీలో, రాష్ట్రవ్యాప్తంగా కూడా చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, ఆయన అసెంబ్లీ నియోగజకవర్గం కొడంగల్ అందులో భాగంగా ఉండటమే కారణం. ఇక్కడ కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇక్కడ పార్టీ ఓడితే తప్పుడు సంకేతాలు వెళ్తాయనే భావనతో ఆయన పట్టుదలతో పని చేశారు. అయినప్పటికీ అక్కడ బీజేపీకే గెలిచే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతున్నది. అదే జరిగితే.. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు ఇదొక స్పీడ్ బ్రేకర్‌లా మారుతుందని భావిస్తున్నారు.

తగ్గిన ఓటింగ్.. టెన్షన్ టెన్షన్

- లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌కు దూరంగా 16 లక్షల మంది
- తగ్గిన పోలింగ్ శాతంపై విశ్లేషణలు
- నష్టం ఎవరికోనని చర్చోపచర్చలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి నష్టం? ఎవరికి లాభం చేకూరుస్తుందనే దానిపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొన్నది. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో దాదాపుగా 16 లక్షల మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ తగ్గిన ఓటింగ్ ఎవరికి నష్టం చేస్తుందన్న కోణంలో విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో నిరుడు నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2.34 కోట్ల మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అంటే 71.97 శాతం పోలింగ్ నమోదైంది. మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 2.18 కోట్ల మంది ఓటు వేశారు. అంటే 65.67 శాతం ఓటింగ్ నమోదైంది. అంటే దాదాపు 16 లక్షలమంది ఓటింగ్‌కు దూరమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క హైదరాబాద్ పరిధిలో మాత్రమే కొంత ఎక్కువ పోలింగ్ జరిగింది. తెలంగాణలో ఎన్నికలు జరిగిన రోజునే పొరుగు రాష్ట్రం ఏపీలోనూ ఎన్నికలు జరగడంతో హైదరాబాద్, పరిసర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఓటింగ్ శాతం తగ్గడానికి ఇదే కారణమని చెప్తున్నారు. ఈ తగ్గిన ఓట్లు ఎవరికి పడాల్సినవన్న చర్చ ఇప్పుడు జోరుగా సాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వీరే కారణమని, ఈ తగ్గిన ఓట్లు కూడా ఆ పార్టీకి పడాల్సినవేనని, కాబట్టి ఇప్పుడు నష్టం జరిగేది కూడా ఆ పార్టీకేనని విశ్లేషిస్తున్నారు.

కేయూ-బౌర్న్‌టెక్ సొల్యూషన్స్ ఒప్పందం

హనుమకొండ చౌరస్తా, జూన్ 3: కాకతీయ విశ్వవిద్యాలయంలోని జియాలజీ విభాగం-బౌర్న్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్ (యూఎస్ఏ బేస్డ్) కంపెనీ మధ్య పరస్పర అవగాహన అంగీకార ఒప్పందం కుదుర్చుకున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వాకాటి కరుణ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి, బౌర్న్‌టెక్ సీజీవో జీ యుగంధర్‌రెడ్డి పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. జియాలజీ విగాధిపతి ప్రొఫెసర్ ఆర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. జీఐఎస్ అనుబంధ విభాగాల్లో ప్రపంచ అత్యుత్తమ అభ్యాసాలను ప్రోత్సహించే సాంకేతిక శిక్షణా కార్యక్రమాలతో విద్యార్థులు, అధ్యాపకులను అభివృద్ధి చేయడానికి విశ్వవిద్యాలయంతో కలిసి బౌర్న్‌టెక్ పనిచేస్తుందని తెలిపారు.

కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో ఒప్పందం చేసుకుంటున్న బౌర్న్‌టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు

ప్రీలాంచ్‌ల పేరుతో దగా

- సామాన్యుల కష్టార్జితం రియల్టర్ల పరం
- న్యాయం కోసం రోడ్డెక్కుతున్న బాధితులు
- పోలీసులకు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): 'ప్రీలాంచ్ ఆఫర్‌లో తక్కువ ధరకు ప్లాట్, ఫ్లాట్, విల్లాను సొంత చేసుకోండి. రెండు మూడేండ్లలో నిర్మాణం పూర్తవుతుంది. మీరు ఊహించని విధంగా ఈ వెంచర్ డెవలప్ అవుతుంది. ఇప్పుడే బుక్ చేసుకుంటే రెండు మూడు రెట్లు తక్కువ ధరకు లభిస్తుంది. 3 నుంచి 5 శాతం మిత్తి గిట్టుబాటవుతుంది. మీతోపాటు మరో ఇద్దరు ముగ్గురు మీ స్నేహితులు, బంధువులు కూడా ప్రీలాంచ్‌లో బుక్ చేసుకున్నారంటే మీకు తక్కువ ధరకు ప్లాట్ వస్తుంది. కొత్త వాళ్లను చేర్పిస్తే మీకు కమిషన్‌తోపాటు మరింత తక్కువ ధరకే ప్లాట్ లభిస్తుంది' అంటూ రాష్ట్రంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డూ అదుపూ లేకుండా అక్రమాలకు తెగబడుతున్నారు. వారి వలలో పడి అమాయకులు పెట్టిన పెట్టుబడుల్లో కొంత భాగాన్ని భూ యజమానులకు చెల్లిస్తున్నారు. మిగిలిన సొమ్మును సొంత ఖాతాల్లోకి మళ్లించుకొని పెట్టుబడిదారులను నట్టేట ముంచుతున్నారు. దీనిపై బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లో ఇలాంటి బాధితుల ఫిర్యాదు మేరకు సాహితీ ఇన్‌ఫ్రా, సాయి నిఖిత, భువనతేజ, ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పలు రియల్ ఎస్టేట్ కంపెనీలపై కేసులు నమోదయ్యాయి.

అడ్వాన్సుగా రూ.1.40 కోట్లు పుచ్చుకుని..

శంకర్‌పల్లి మోకిలాలో ప్రీలాంచ్ పేరుతో ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆన్‌లైన్‌లో ఇచ్చిన ప్రకటనను చూసి నారాయణగూడకు చెందిన కే రాఘవేంద్రతోపాటు అనిల్ అనే మరో వ్యక్తి ముందుకొచ్చారు. చదరపు గజానికి రూ.4,500 చొప్పున విల్లాలు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వారి నుంచి రూ.70 లక్షల చొప్పున మొత్తం రూ.1.40 కోట్లు అడ్వాన్సు తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి నిర్మాణాన్నీ చేపట్టలేదు. దీంతో బాధితులు జూబ్లీహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.మేనేజింగ్ డైరెక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు గుంటుపల్లి పద్మజ, గుంటుపల్లి అనూష, గుంటుపల్లి సమంత, ఈదర వంశీకృష్ణ చౌదరిపై కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు సీసీఎస్‌కు బదిలీ అయింది.

2,500 మందికి బూదాటి కుచ్చుటోపీ

సాహితీ ఇన్‌ఫ్రాపై హైదరాబాద్ సీసీఎస్‌తోపాటు సైబరాబాద్, రాచకొండ, ఏపీలోని విజయవాడ తదితర పలు ప్రాంతాల్లో 58కిపైగా కేసులు నమోదయ్యాయి. ఆ సంస్థ నిర్వాహకుడు బూదాటి లక్ష్మీనారాయణ వివిధ వెంచర్ల పేరుతో దాదాపు 2,500 మంది అమాయకుల నుంచి రూ.3 వేల చొప్పున వసూలుచేసి బిచాణా ఎత్తేశాడు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు వంకర బుద్ధితో అటు సాహితీ ఇన్‌ఫ్రా యాజమాన్యం నుంచి, ఇటు బాధితుల నుంచి భారీగా డబ్బు దండుకునేందుకు ప్లాన్ వేశాడు. దీనిపై ఇటీవల ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఆయనతోపాటు బంధువులు, స్నేహితుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఉమామహేశ్వర్‌రావును అరెస్టు చేయడంతో సాహితీ ఇన్‌ఫ్రా అక్రమాలపై దర్యాప్తు జరిపే బాధ్యతను మరో అధికారికి అప్పగించేందుకు కసరత్తు జరుగుతున్నది.

రెరా అనుమతి ఉంటేనే కొనాలి..

ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో రియల్టర్లు చెప్పే మాయమాటలను ఎవరూ నమ్మరాదు. ఇండ్లు, ప్లాట్లను అమ్మే సంస్థల గత చరిత్రతోపాటు ఇతర అన్ని వివరాలను కొనుగోలుదారులు క్షుణ్ణంగా పరిశీలించాకే ముందడుగు వేయాలి. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అనుమతులున్న ప్రాజెక్టుల్లోనే ఇండ్లు, స్థలాలు కొనుగోలు చేయాలి. ఇలాంటి సంస్థల చేతిలో ఎవరైనా మోసపోతే రెరా ద్వారా న్యాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది. గతంలో ఎలాంటి ప్రాజెక్టునూ చేపట్టని సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ ఒకేసారి 15 వెంచర్లు ప్రారంభించింది. ఆ ప్రాజెక్టులకు రెరా, హెచ్‌ఎండీఏ అనుమతులు లేవు. - శ్వేత, సీసీఎస్ డీసీపీ

రూ.2.10 కోట్లతో బోర్డు తిప్పేసిన 'సాయి నిఖిత'

అమ్మిన ప్లాట్లనే మళ్లీ మళ్లీ అమ్ముతూ అమాయకుల నుంచి రూ.2.10 కోట్లు కొల్లగొట్టిన సాయి నిఖిత ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బోర్డు తిప్పేసింది. ఆ సంస్థ యజమానులు బీబీనగర్‌లోని 'బృందవన్-11' లేఅవుట్‌లో తక్కువ ధరకు ప్లాట్లు విక్రయిస్తున్నామంటూ ఎంతో మంది నుంచి డబ్బులు వసూలు చేసి ముఖం చాటేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో కేసు నమోదైంది.

'భువనతేజ' భారీ మోసం

ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో భువనతేజ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భారీ మోసానికి పాల్పడింది. శామీర్‌పేటలో చదరపు గజానికి రూ.1,600 చొప్పున ధరతోనే ఇండ్లు నిర్మించి ఇస్తామని నమ్మించి దాదాపు 100 మంది అమాయకుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసింది. అనంతరం ఆ సంస్థ బిచాణా ఎత్తేయడంతో బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు.